ఓపెన్‌స్కూల్స్‌లో తత్కాల్ అడ్మిషన్లు

గుజరాతీపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సార్వత్రిక విద్యా పీఠం నిర్వహించే ఓపెన్ స్కూల్స్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ తత్కాల్ ప్రవేశాల ప్రక్రియకు సంబంధించి ఈ నెల 6వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు డీఈవో రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ ఫీజు ఈ నెల పదో తేదీలోగా చెల్లించాలని సూచించారు. 'ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని.. రిఫరెన్స్ నెంబర్‌తో సమీపంలో ఉన్న స్టడీ సెంటర్ కోఆర్డినేటర్‌ను సంప్రదించాలి. లాగిన్ ఐడీ ద్వారా ప్రవేశ ప్రక్రియ పూర్తిచేయాల'ని డీఈవో తెలిపారు.



మళ్లీ తెరపైకి..

- ఉపాధ్యాయులకు గ్రేడింగ్ విధానం
- పాఠశాల అభ్యుదయ ప్రగతి కోసం ప్రభుత్వ సంకల్పం
- విద్యార్థుల సామర్థ్యాలు ఆధారంగా గుర్తింపు
- ఇందుకోసం కేపీఐ, జీఎఫ్‌ఎల్‌ఎన్ సర్వేలు

నరసన్నపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పనితీరు ఆధారంగా గ్రేడింగ్ ఇచ్చే విధానాన్ని విద్యాశాఖ మళ్లీ తెరపైకి తీసుకువచ్చింది. ఉపాధ్యాయుల ప్రతిభను అంచనా వేసి ఏ,బీ,సీ,డీ గ్రేడ్‌లను ఇవ్వనుంది. 2017లో గ్రేడింగ్ విధానం లో ఉపాధ్యాయుల బదిలీల్లో అదనపు పాయింట్లు ఇచ్చారు. ఈసారి గ్రేడింగ్ విధానం ద్వారా ఉపాధ్యాయుల బదిలీల్లో అదనపు పాయింట్లతో పాటు విద్యా వ్యవస్థను బలోపేతానికి భాగస్వామ్యం చేయనున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేసేందుకు టీచర్ కీలక పనితీరు సూచన(కీ పెర్ఫార్మేషన్ ఇండికేటర్స్- కేపీఐ) సర్వే నిర్వహించనున్నారు. ఈ సర్వే ఉపాధ్యాయుల బోధన నాణ్యత, విద్యార్థుల సామర్థ్యం, పాఠశాల లక్ష్యసాధనలో వారి సహకారాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడుతుంది. అలాగే ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకు డైట్ విద్యార్థులు, సీఆర్పీల సహాయంతో విద్యార్థులకు జీఎఫ్ఎల్ఎన్(గ్యారెంటీ ఫౌండేషన్ లెర్నింగ్ న్యూమరీస్) సర్వే నిర్వహిస్తారు. లీప్ యాప్ ద్వారా తెలుగు, ఇంగ్లిషు, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తున్నారు. మళ్లీ మూడు నెలల తర్వాత మరో సర్వే నిర్వహించి.. విద్యార్థుల సామర్థ్యాల మేరకు ఉపాధ్యాయులకు గ్రేడింగ్ ఇస్తారు. ఉన్నత పాఠశాలలోనూ ఇదే విధానం అమలు చేస్తారు. పదోతరగతి బోధించే ఉపాధ్యాయులకు.. ఫలితాలు కొలమానం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

సర్వే ప్రయోజనాలు ఇవీ..

పాఠశాలల్లో మెరుగైన బోధన, లక్ష్యసాధనలో ఉపాధ్యాయుల సహకారం, పాఠశాల కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం ఈ సర్వే ప్రధాన ఆశయం. అభ్యసన ఫలితాలు పెంపొందించేందుకు దోహదపడుతుంది. గ్రేడింగ్ విధానం పారదర్శకంగా ఉంటుంది. కష్టపడే ఉపాధ్యాయులకు గుర్తింపునిస్తుంది. పనితీరులో వెనుకబడినవారిని గుర్తించి.. మెరుగుపరిచేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థుల సామర్థ్యాల మదింపు కూడా పారదర్శకంగా ఉండేలా విద్యా శాఖ చర్యలు చేపడుతోంది. ఒక డైట్ విద్యార్థి, సీఆర్పీ, సచివాలయ సిబ్బంది కలిసి పాఠశాలలు, తరగతులు వారీగా చదవడం, నెంబర్లను గుర్తించడం వంటి అంశాలు యాప్‌లో చూస్తూ విద్యార్థులు వాటిని గుర్తించాల్సి ఉంటుంది. విద్యార్థులు చెప్పే దానిని రికార్డు చేసి సామర్థ్యాన్ని అక్కడికక్కడే మదింపు చేస్తుంది. ఈ విధానంతో ఉపాధ్యాయులకు గ్రేడింగ్ పారదర్శకంగా ఇచ్చేందుకు దోహదపడుతుంది.

- జిల్లాలో 2,067 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠ శాలలు, 450 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1,34,885 మంది విద్యార్థులు చదువుతున్నారు. సుమారు 12వేలమందికిపైగా ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్నారు. ఉపాధ్యాయులు పనితీరు ఆధారంగా గ్రేడింగ్ విధానం.. కొందరికి ఆమోదంకాగా.. మరికొందరు మాత్రం దీనిపై గుర్రుగా ఉన్నారు. గ్రేడింగ్ విధానంతో విద్యాప్రమాణాలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉంటాయని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. బోధనేతర కార్యక్రమాల భారం (మిగతా 7వ పేజీలో..)

పాఠశాలలకు విద్యా బోధకులు

- వలంటీర్ల స్థానంలో తాత్కాలిక నియామకాలు
- జిల్లాకు 24 పోస్టులు మంజూరు
- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 8 నుంచి విధుల్లో చేరేలా సన్నాహాలు

నరసన్నపేట/ పాతపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న స్థానంలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సుదీర్ఘకాలం కిందట రెగ్యులర్ టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యా వలంటీర్లు పనిచేసేవారు. తాత్కాలిక ప్రాతిపదికన వారిని తీసుకొని పారితోషికం చెల్లించేవారు. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పేరుతో ఆ విధానాన్ని తిరిగి ఇప్పుడు ప్రవేశపెట్టారు. వీరిని తాత్కాలిక పద్ధతిలో నియమించనున్నారు. ఇటీవల మెగా డీఎస్సీతో ఉపాధ్యాయుల కొరత దాదాపు అధిగమించినప్పటికీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతేడాది కంటే విద్యార్థుల సంఖ్య పెరగడం, కొందరు ఉపాధ్యాయులు పదవీ విరమణ చెందడంతో కొన్నిచోట్ల ఖాళీలు ఏర్పడ్డాయి. ఎస్జీటీలు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉండటంతో జిల్లాలో ఒక్క పోస్టుకూడా ఖాళీ లేదు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో గణితం-4, ఫిజికల్ సైన్సు -5, బయాలజీ - 9, సోషల్ -6 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో 24 మంది స్కూల్ అసిస్టెంట్‌లను తాత్కాలికంగా నియమించేందుకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇన్‌స్ట్రక్టర్లకు స్కూల్ అసిస్టెంట్‌లకు రూ.12,500 చొప్పున గౌరవ వేతనం చెల్లించనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి బుధవారం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఈ నెల 5వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. గ్రామం, తారువాత మండలం, ఆ తరువాత జిల్లాలో అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తారు. 75శాతం అకడమిక్ , 25శాతం బీఈడీ వెయిటేజ్ ఇవ్వనున్నారు. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం చేసేందుకు జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్, డీఈవో సెలక్షన్ కమిటీ కార్యదర్శి, డైట్ ప్రిన్సిపాల్ సభ్యులుగా ఉంటారు. ఎంఈవోలకు వచ్చిన దరఖాస్తులను డీఈవోకు పంపించి ఈనెల 7వ తేదీలోగా ఎంపిక పక్రియ పూర్తిచేస్తారు. ఎంపికైన వారు ఈ నెల 8వ తేదీ నుంచి విధుల్లో చేరనున్నారు. మే 7 వరకు విధుల్లో కొనసాగనున్నారు.

ఖాళీ పోస్టులు ఇవీ..

- గణితం విభాగంలో పాతపట్నం, బారువ(సోంపేట) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతోపాటు ఆర్.బెలగాం(కవిటి), డొంకూరు (ఇచ్ఛాపురం) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- ఫిజికల్ సైన్స్ విభాగంలో పాతపట్నం, పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతోపాటు బీఆర్‌సీ పురం(సోంపేట), పి.మెళియాపుట్టుగ(కవిటి), కవిటి(ఒడియా మీడియం) జడ్పీ పాఠశాలల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- బయోలజికల్ సైన్స్ విభాగంలో (మిగతా 7వ పేజీలో..)



విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యేలు శంకర్, రమణమూర్తి

విభిన్న ప్రతిభావంతుల్లో ధైర్యాన్ని నింపండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పాత శ్రీకాకుళం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల్లో ధైర్యాన్ని నింపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు వైద్య సదుపాయాలు, కృత్రిమ అవయవాలు, మూడు చక్రాల వాహనాలు, వీల్‌చైర్స్, శ్రవణ యంత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. 'స్వాభిమాన్' పేరుతో నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా దివ్యాంగుల సమస్యలు తక్షణమే పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. దృష్టి లోపం ఉన్న వికలాంగులకు రిమ్స్ ఆసుపత్రిలో ఏఐ ఆధారిత ప్రత్యేక చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దివ్యాంగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ దివ్యాంగులకు సేవలు అందించిన విద్యార్థులను ప్రశంసించారు. దివ్యాంగులకు ప్రభుత్వం గృహాలు, కుటుంబ పింఛను, రిజర్వేషన్ వంటి సౌకర్యాలు కల్పిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిగ్రీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో గెలుపొందిన వారికి కలెక్టర్, ఎమ్మెల్యేలు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏడీ శైలజ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరో 409 రోజులు

- మూలపేట పోర్టు నిర్మాణ గడువు పెంచిన ప్రభుత్వం
- పనుల్లో జాప్యంపై జరిమానా లేదని స్పష్టీకరణ

శ్రీకాకుళం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతిష్ఠాత్మక మూలపేట(గతంలో భావనపాడు) గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్(పోర్ట్స్)శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు(జీఓ ఆర్టీ 94) జారీ చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఈ పోర్టు పనుల పూర్తికి కాంట్రాక్టు సంస్థకు 2026 నవంబరు 30 వరకు గడువు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. వాస్తవానికి ఒప్పందం ప్రకారం ఈ ఏడాది అక్టోబరు 17నాటికి పనులు పూర్తిచేయాలి. కానీ వివిధ కారణాల రీత్యా పనులు ఆలస్యమవడంతో మరో 409 రోజులపాటు గడువు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

- కారణాలివే...

విశ్వసముద్ర పోర్ట్స్ (జేవీ) సంస్థ ఈ ప్రాజెక్టును రూ.2,949.70కోట్ల వ్యయంతో దక్కించుకుంది. ఈ ఏడాది అక్టోబర్ 17 నాటికి 60.49 శాతం భౌతిక పనులు, 56.28 శాతం ఆర్థిక పురోగతి మాత్రమే సాధించారు. ప్రతికూల వాతావరణం, తుఫాన్‌లు, ముడి ఖనిజాల(మైనర్ మినరల్స్) సరఫరాపై ప్రభుత్వం ఆంక్షలు, పునరావాస(ఆర్అండ్ఆర్) సమస్యల వల్ల సైట్ అప్పగించడంలో జాప్యం వంటి కారణాలు.. పనుల ఆలస్యానికి దారితీశాయని అధికారులు నివేదిక ఇచ్చారు.

- ఈ అంశాలను పరిశీలించిన టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీ సిఫారసుల మేరకు గడువు పెంపునకు ఆమోదం లభించింది. జాప్యానికి సంబంధించి కాంట్రాక్ట్ సంస్థపై ఎటువంటి లిక్విడేటెడ్ డ్యామేజెస్(జరిమానా) విధించడం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే గడువు పొడిగించినందుకు కాంట్రాక్టు సంస్థ ఎలాంటి అదనపు ఖర్చులను క్లెయిమ్ చేయకూడదని షరతు విధించింది. దీనికి అంగీకరిస్తూ నిర్మాణ సంస్థ ఇప్పటికే అండర్ టేకింగ్ ఇచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



మూలపేట పోర్టు పనులు (ఫైల్)



ఎలా చదువుతున్నారో తెలుసుకోండి

- రేపు పాఠశాలల్లో మెగా పీటీఎం 3.0

హిరమండలం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పిల్లల చదువులు ఎలా సాగుతున్నాయి? పాఠశాలలో, తరగతి గదిలో వారి నడవడిక ఎలా ఉంది? వారి బంగారు భవిష్యత్‌కు ఏం చేస్తే బాగుంటుంది? అని చర్చించేందుకు మెగా పేరేంట్స్ టీచర్స్ మీటింగ్(పీటీఎం) సరైన వేదిక. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండుసార్లు నిర్వహించిన పీటీఎంలు విజయవంతమయ్యాయి. జూలై 10న పీటీఎం 2.0 పేరిట పర్యావరణానికి ప్రాధాన్యమిస్తూ.. విద్యార్థులతో మొక్కలు నాటించారు. తాజాగా ఈ నెల 5న ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పీటీఎం-3.0 కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

- జిల్లాలో 1195 ప్రాథమిక, 315 ప్రాథమికోన్నత, 419 ఉన్నత పాఠశాలు, 25 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో ఈ నెల 5న ఉదయం 9 నుంచి 9.30గంటల మధ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు, సామాజిక సేవకులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులను సాదరంగా ఆహ్వానిస్తారు. తల్లిదండ్రులను పిల్లల వద్ద తరగతి గదుల్లో కూర్చోబెడతారు. 10.50గంటల వరకు ప్రతి విద్యార్థితో తల్లిదండ్రుల ఎదుటే వారి అభ్యసన సామర్థ్యాలపై మాట్లాడతారు. బోధనలో అవలంబిస్తున్న నూతన పద్ధతులను వీడియోల రూపంలో ప్రదర్శిస్తారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, నైపుణ్య ఆంధ్ర తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారు. తర్వాత టీఎల్ఎం, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, స్టెమ్‌ల్యాబ్, క్రాఫ్ట్ ప్రాజెక్టులను విద్యార్థులతో ప్రదర్శిస్తారు. 11 నుంచి 12.45 గంటల వరకు సమావేశాన్ని నిర్వహి స్తారు. 'మా తెలుగు తల్లికి పాటతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ప్రోగ్రెస్ రిపోర్టులు చదివి వినిపించడంతోపాటు వాటిని విద్యార్థులకు అందజేస్తారు. దాతల సహకారంతో విద్యా సామగ్రిని పంపిణీ చేస్తారు.

జీడివ్యాపారి రూ.3కోట్ల టోకరా

- జీడిపప్పు లావాదేవీల్లో మోసం
- తోటి వ్యాపారులకు ఎగనామం

పలాస, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పలాసలో ఓ జీడివ్యాపారి రూ.3కోట్ల మేర తోటి వ్యాపారులకు ఎగనామం పెట్టాడు. ఆ డబ్బుతో ఉడాయించాడు. ఈయన అందరి వద్ద నమ్మకంగా ఉంటూ జీడి వ్యాపారంలో భాగంగా రూ.కోట్లలో లావాదేవీలు చేసేవాడు. సుమారు 50మంది వ్యాపారుల నుంచి రూ.3కోట్ల విలువైన జీడిపప్పు సేకరించి.. దేశంలో వివిధ ప్రాంతాలకు పంపించి సొమ్ము చేసుకున్నాడు. అయితే తీసుకున్న జీడిపప్పునకు నగదు ఇవ్వకుండా నెలల తరబడి తిప్పుతుండడంతో వ్యాపారులకు అనుమానం వచ్చింది. తమ డబ్బులు ఇవ్వాలంటూ కొద్దిరోజుల కిందట వ్యాపారులు ఆయన్ను ప్రశ్నించారు. కాగా, తనకు ఇతర రాష్ట్రాల నుంచి డబ్బులు రావాల్సి ఉందని, అవి వచ్చిన వెంటనే అందరికీ బాకీలు తీరుస్తానని నమ్మబలికాడు. దీంతో వ్యాపారులు ఏదో ఒకరోజు తమ డబ్బులు తిరిగి వస్తాయని భావించారు. కానీ జీడిపప్పు విక్రయించిన డబ్బులతో వ్యాపారి పరారీ కావడంతో తోటి వ్యాపారులంతా ఆందోళన చెందుతున్నారు. తాము మోసపోయామని లబోదిబోమంటున్నారు.

- పలాస-కాశీబుగ్గ జీడి వ్యాపార సంస్థల్లో (మిగతా 8వ పేజీలో..)

అదృశ్యమైన మహిళ.. శవమై తేలింది

- మురపాకలో వృద్ధురాలి హత్య
- నిందితుల కోసం పోలీసుల గాలింపు

లావేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మురపాకలో వడ్డి పార్వతి(64) అనే వృద్ధురాలు హత్యకు గురైంది. పార్వతి ఈ నెల 1న పశువులను మేత కోసం ఊరిబయట పొలాల వద్దకు తీసుకెళ్లింది. ఆ రోజు సాయంత్రం ఆమె ఇంటికి చేరుకోలేదు. పెద్దకుమారుడు లక్ష్మణరావుతోపాటు కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికారు. మంగళవారం తన తల్లి పార్వతి కనిపించడం లేదంటూ లక్ష్మణరావు లావేరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం లావేరు, రణస్థలం ఎస్ఐలు కొండపల్లి అప్పలసూరి, ఎస్ చిరంజీవి సిబ్బందితోపాటు క్లూస్‌టీం, డాగ్ స్క్వేడ్ సహాయంతో వెతక సాగారు. అయినా ఆమె జాడ కానరాలేదు. బుధవారం గొల్లబడి సమీపాన పంట పొలాల్లోని పాడైన (మిగతా 8వ పేజీలో..)



పార్వతి (ఫైల్)



బావిలో పార్వతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, గ్రామస్థులు

ఆమెను చంపేశారా?

- వివాహిత అనుమానాస్పద మృతి
- మెడకు తాడు బిగించినట్లు ఆనవాళ్లు
- జాతీయ రహదారి పక్కన మృతదేహం



తులసీ రత్నం (ఫైల్)

ఎచ్చెర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట పరిధిలోని జాతీయ రహదారి పక్కన బుధవారం ఉదయం వివాహిత గురుగుబెల్లి తులసీ రత్నం(42) మృతదేహం అనుమానాస్పద స్థితిలో పడి ఉంది. పొందూరు మండలం పిల్లలవలస గ్రామానికి చెందిన తులసీరత్నానికి ఆమదాలవలస మండలం కొత్తవలసకి చెందిన కూర్మారావుతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరిద్దరూ కుమారుడు వెంకటరమణ, కుమార్తె సంధ్యారాణితో కలిసి శ్రీకాకుళం నగరం ఏఎస్ఎన్ కాలనీలో 14 ఏళ్లుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కూర్మారావు ఫినాయిల్ వ్యాపారం చేసేవారు. ఇటీవల అనారోగ్యం కారణంగా ఇంటి వద్దనే ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో సీతారత్నం వైద్యుడి వద్దకు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చారు. రాత్రి 8.30 గంటలైనా ఆమె ఇంటికీ చేరలేదు. ఆమెకు ఫోన్ చేసినా సమాధానం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆమె ఆచూకీ కోసం బంధువులను ఆరా తీశారు. అయినా సమాచారం లేదు. దీంతో శ్రీకాకుళంలో రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు ఆమె కుమారుడు వెంకటరమణ సమాచారం ఇచ్చారు.

- ఇదిలా ఉండగా, బుధవారం ఉదయం తులసీరత్నం మృతదేహం ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట సమీపంలోని జాతీయ రహదారి సర్వీసు రోడ్డు పక్కన పడి ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎచ్చెర్ల, జేఆర్ పురం, జి.సిగడాం ఎస్ఐలు జి.లక్ష్మణరావు, ఎం.చిరంజీవి, వి.సందీప్‌కుమార్ సంఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీమ్ వివరాలు సేకరించింది. పోలీసు జాగిలాలు (మిగతా 8వ పేజీలో..)

జాడుపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

మెళియాపుట్టి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మెళియాపుట్టి మండలం జాడుపల్లి సర్పంచ్ కె.గాయత్రి చెక్‌పవర్ రద్దు చేసినట్లు ఎంపీడీవో ప్రసాద్ పండా తెలిపారు. 'సర్పంచ్ గాయత్రి పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు గ్రామానికి చెందిన తుంగాన రామదాసు ఫిర్యాదు చేశారు. దీనిపై టెక్కలి డీఎల్‌పీవో విచారణ చేశారు. సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి భారతీ సౌజన్య ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో వెల్లడించారు.

కొసమాళలో పునరుద్ధరణ

మెళియాపుట్టి మండలం కొసమాళ పంచాయతీ సర్పంచ్ ఉర్లాన రవికూమార్ చెక్ పవర్ పునరుద్ధరించినట్టు ఎంపీడీవో ప్రసాద్ పండా తెలిపారు. 'పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసినట్టు గతంలో గ్రామానికి చెందిన ఎస్.జగదీష్ ఫిర్యాదు చేశారు. దీనిపై టెక్కలి డీఎస్‌పీవో బాలగోపాల్ దర్యాప్తు చేశారు. నిధులు దుర్వినియోగమైనట్టు నిర్ధారించి ఆరు నెలల కిందట చెక్‌పవర్ రద్దు చేశారు. అప్పటి కార్యదర్శిగా ఉన్న మనోహర్‌ను సస్పెండ్ చేశారు. దీంతో సర్పంచ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం తీర్పు మేరకు చెక్‌పవర్ పునరుద్ధరించాలని డీపీవో భారతీ సౌజన్య ఉత్తర్వులు జారీచేశా'రని ఎంపీడీవో తెలిపారు.

సామర్థ్యాలతోనే విజయాలు సాధ్యం
- జిల్లా ఉపాధి కల్పనాధికారి సుధ

7లో

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం
- డీఎంహెచ్‌వో డా.అనిత

బుడితి కంచు హస్తకళలకు ప్రపంచస్థాయిలో గుర్తింపునకు కృషి

8లో

పాఠశాలలకు విద్యా బోధకులు

(ఐదో పేజీ తరువాయి)

గొప్పిలి(మెళియపుట్టి), రెంటికోట(పలాస), ముండేల(కంచిలి), రాజపురం(కవిటి), పి.మెళియాపుట్టుగ (కవిటి), కవిటి (ఒడియా మీడియం), కొలిగాం (ఇచ్ఛాపురం), బిర్లంగి (ఇచ్ఛాపురం) జడ్పీ పాఠశాలల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే బారువ(సోంపేట)లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూడా ఒక పోస్టు భర్తీ చేయనున్నారు. ● సోషల్ స్టడీస్ విభాగంలో కొలిగాం (ఇచ్ఛాపురం), బిర్లంగి (ఇచ్ఛాపురం), మండపల్లి(ఇచ్ఛాపురం), మాణిక్యపురం(కవిటి), రెంటికోట(పలాస), చాపర(మెళియాపుట్టి) జడ్పీ పాఠశాలల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మళ్లీ తెరపైకి..

(ఐదో పేజీ తరువాయి)

తగ్గించి మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొంటున్నారు.

బోధనేతర కార్యక్రమాలు వద్దు..

ఉపాధ్యాయులకు గ్రేడింగ్ ఇవ్వడం మంచిదే. ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయులకు బోధన చేసేందుకు తగినంత సమయం ఇవ్వాలి. యోగా డే, మెగా పేరెంట్స్ డే వంటి వేడుకలు ద్వారా మూడేసి రోజుల బోధన సమయం తగ్గుతోంది. బోధనేతన కార్యక్రమాలకు ఉపాధ్యాయులను దూరంగా ఉంచాలి. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి అడుగులు వేయాలి. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడ్ని నియమించాలి.

-బమ్మిడి శ్రీరామమూర్తి, యూటీఎఫ్, జిల్లాప్రధాన కార్యదర్శి

సామర్థ్యాలు ఒకేలా ఉండవు..

ఉన్నత పాఠశాలల్లో సిలబస్ గుదిబండగా తయారైంది. అంత సిలబస్‌ను బోధించేందుకు సమయం చాలడం లేదు. విద్యార్థుల సామర్థ్యాలు ఒకేలా ఉండవు. ఉపాధ్యాయులు బోధన, విద్యా లక్ష్యాల సాధనలో చేస్తున్న కృషి ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వాలి.

-బుద్దల కేశవరావు, గణిత ఉపాధ్యాయుడు, సత్యవరం ఉన్నత పాఠశాల

'థర్మల్' ప్రతిపాదనలు రద్దు చేయాలి



ప్రతులను దహనం చేస్తున్న గిరిజన సంఘాల నేతలు

బూర్జ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): థర్మల్ విద్యుత్ సూపర్ క్రిటికల్ పవర్‌ప్లాంట్ ప్రతిపాదనలు తక్షణం రద్దు చేయాలని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు, ఆదివాసీలు డిమాండ్ చేశారు. అన్నంపేట పంచాయతీ జంగాలపాడు గ్రామంలో బుధవారం ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు సురేష్‌దొర, కార్యదర్శి సవర సింహాచలం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. థర్మల్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సవర లక్ష్మణరావు, నాగేశ్వరరావు, రామలింగం, మనోజ్, మిన్నారావు, కూర్మారావు పాల్గొన్నారు.

58 మంది దంపతులతో హనుమాన్ వ్రతం



హనుమాన్ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఇచ్ఛాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మెయిన్‌రోడ్‌లోని కోదండ రామస్వామి దేవాలయంలో సామూహిక హనుమత్ వ్రతాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు పద్మకుమారాచార్యులు సుప్రభాత సేవ, ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 58మంది దంపతులతో సామూహిక హను మత్ వ్రతాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఈవో రవిబాబు

సరుబుజ్జిలి, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు అన్నారు. నందికొండ ప్రాథమిక పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక అక్షరాస్యత, అసైన్ మెంట్ బుక్స్, అపార్‌ను పరిశీలించి సూచనలు అందించారు. కార్య క్రమంలో ఎంఈవోలు శ్రీనివాసరావు, బాలరాజు, సీఆర్ఎంటీలు బెండి చిన్నారావు, రోహిణి పాల్గొన్నారు.

వైసీపీ నేత 'చింతాడ'పై చర్యలు తీసుకోండి

● పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నేతల ఫిర్యాదు

ఆమదాలవలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్‌పై వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ నిరాధార, వ్యక్తిగత ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల నేతలు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేపై చేస్తున్న నిరాధార ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేని వ్యక్తిగతంగా దూషించడం, అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు. తక్షణం అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు, నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, నాయకులు సంపదరావు మురళి, బోర గోవిందరావు, ఇంజరాపు విశ్వనాథం పాల్గొన్నారు.

బాధితులను ఆదుకునేందుకు కృషి



బాధితులకు నగదు అందిస్తున్న నేతలు

పొందూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో 42 గొర్రె పిల్లలను కోల్పోయిన గొర్రె యజమానులను ఆదుకుంటామని జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్ అన్నారు. కొంచాడ గ్రామంలో మంద యజమానులను బుధవారం పరామర్శించారు. గ్రామాల్లో కుక్కలను నియంత్రించాలని గ్రామస్థులు వారి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం బాధితులకు నగదు అందించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర్, మాజీ సర్పంచ్ ముగడ తవిటినాయుడు, జనసేన నాయకుడు కొంచాడ చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులపై శ్రద్ధ వహించాలి

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు



మానసిక దివ్యాంగ పిల్లలకు మిఠాయిలు పంచుతున్న కార్యదర్శి హరిబాబు



టెక్కలి: మాట్లాడుతున్న న్యాయాధికారి నిర్మల

శ్రీకాకుళం లీగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులైన పిల్లలపై సమాజం శ్రద్ధ వహించి వారికి అన్ని విధాలా తోడుగా నిలవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా స్థానిక బెహరా మనోవికాస కేంద్రంలో సమావేశం నిర్వహించారు. అక్కడ ఉంటున్న విద్యార్థులు, వారికి అందిస్తున్న సేవలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. బుద్ధిహీనత ఉన్న పిల్లలను గుర్తించి వారికి పథకాలను సక్రమంగా అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో న్యాయవాది ఇందిరా ప్రసాద్, కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

అసాధారణ విభిన్నతే ప్రత్యేక గుర్తింపు

పాత శ్రీకాకుళం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అసాధారణ ప్రతిభ కలిగిన వారే ప్రతిభావంతులని మెప్మా పీడీ ఎస్.వెంకటరావు అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని బుధవారం స్థానిక ఎంపీసీఆర్సీలో నిర్వహించారు. విభిన్న ప్రతిభా వంతుల అభ్యున్నతికై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయన్నారు. విభిన్న ప్రతిభావంతుల మనోవికాసానికి బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా సాంకేతిక నిపుణుడు బి.రామారావు, శ్రీనిధి పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షులు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

దివ్యాంగులను గౌరవిద్దాం

టెక్కలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను గౌరవించడం మనందరి బాధ్యత అని స్థానిక సివిల్ కోర్టు నాయాధికారి బి.నిర్మల అన్నారు. బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వినకాన అజయ్‌కుమార్, ఏజీపీ డి.వివేకానంద, ఎంఈవోలు డి.తులసీరావు, చిన్నా రావు, ఏఎంసీ చైర్మన్ బగాది శేషగిరి పాల్గొన్నారు.

● పలాస: దివ్యాంగులకు ఉచిత న్యాయసహాయం అందుబాటులో ఉందని పలాస బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫయ్యాజ్‌అహ్మద్ (ఫని) అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో దివ్యాంగులకు బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. న్యాయవాదులు ఎస్.నాగేశ్వరరావు, సిహెచ్.దివ్యశ్రీ, వై.తిరుపతి రావు, డి.అనంత్ పాల్గొన్నారు.

పుణ్య క్షేత్రాల జాబితా సిద్ధం చేయండి

పాత శ్రీకాకుళం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పుణ్యక్షేత్రాల జాబితాను వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దేవాలయ ఈవోలను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ బంగ్లాలో జాతరపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో ఈఓ తన పరిధిలో ఉన్న పుణ్య క్షేత్రాలెన్ని ఉన్నాయి, వాటి చరిత్రలను తయారు చేసి అందించాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి రథసప్తమికి వచ్చే భక్తులు పుణ్య క్షేత్రాల సందర్శనకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

6న దిశా కమిటీ సమావేశం

పాత శ్రీకాకుళం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ పరిరక్షణ కమిటీ (దిశా) సమావేశం ఈనెల 6న జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు సీఈవో పి.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రి, దిశా కమిటీ గౌరవ చైర్మన్ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అధ్యక్షత వహించనున్నారన్నారు. మెంబర్ సెక్రటరీ, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమక్షంలో జరిగే ఈ సమావేశానికి సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

తినుబండారాలు నిల్వ చేస్తే చర్యలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): డయేరియా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో హోటల్ యజమానులు అప్రమత్తంగా ఉండాలని, తినుబండరాలు నిల్వ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో హోటల్స్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. నిల్వ ఉంచిన పదార్థాలు విక్రయిస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని స్పష్టంచేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లు పరిశుభ్రంగా ఉంచాలి

ఆమదాలవలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో పరిశుభ్రత పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో టిఫిన్ సెంటర్లు, దాబాలు, హోటళ్లు, రెస్టారెంట్ల యజమాను లతో సమావేశం నిర్వహించారు. ఆహార పదార్థాల నాణ్యత, నీటి సరఫరా, పరిశుభ్రతపై పలు సూచ నలు చేశారు. వంటకాలను భద్రపరిచి మరుసటి రోజు అమ్మడం పూర్తిగా నిషిద్ధమన్నారు. ప్రజలకు తప్పనిసరిగా మినరల్ వాటర్ అందుబాటులో ఉంచాలన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.సిగడాం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాలఖండ్యాం ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.యోగేశ్వరరావు, ఏఈ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్లు మరమ్మతులు, విద్యుత్ లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మల తొలగింపు చేపడుతున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. ఆనందపురం, దవళపేట, సంతవురిటి, పాలఖండ్యాం, మెట్టవలస పంచాయతీల్లోని అన్ని గ్రామాల ప్రజలు గమనించాలని కోరారు.

● రణస్థలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పైడి భీమవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పైడిభీమవరం, నారువ, వరిసాం, దేవునిపాలవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనిం చాలని కోరారు.

● కోటబొమ్మాళి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనుండడంతో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంట ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో టెక్కలి ఈఈ నరసింహకుమార్ పేర్కొన్నారు. దీంతో కొత్తపల్లి, సరియాపల్లి, కురు డు, చౌదరి కొత్తూరు, దంత, నారాయణపురం, చిన్నసాన, పులిబంధ, రామ్మూర్తిపేట, కిడిమి, కిడిమి బుడితి, భద్రాచలం, జమచక్రం, మదనా పురం, జరాలి, సవరపేట, కిడిమి గొల్లపేట, చంద్రయ్యపేట తదితర గ్రామాలకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

● పోలాకి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిన్నింటిపేట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతుండడంతో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ నరసింహకుమార్, ఏఈ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. పిన్నింటిపేట, కోదూరు, మగతపాడు, గుప్పెడుపేట, జోగంపేట, డీఎల్ పురం, సత్రవుపేట, బొద్దాం, వనవిష్ణుపురం, ఆక్వా పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం

● డీఎంహెచ్‌వో డా.అనిత



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డా.అనిత

పాత శ్రీకాకుళం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని డీఎంహెచ్‌వో డా.కె.అనిత స్పష్టం చేశారు. లింగ ఆధారిత హింస నివారణ, మెడికల్ లీగల్ కేర్‌పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, సామాజిక, ఏరియా ఆసుపత్రుల వైద్యాధికారులకు బుధవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీపీఎన్‌డీటీ చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని, ఈ చట్టాన్ని ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. హింసకు లోనైన అనాథ పిల్లలను గుర్తించి, వారిని శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. డీసీహెచ్ఎస్ డా.ఎస్.కల్యాణ్ బాబు మాట్లాడుతూ.. సమాజంలో ఆడ, మగ సమానమేనని, మహిళలకు విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక గౌరవం, చట్టపరమైన రక్షణ అందించాలన్నారు. రిటైర్డ్ న్యాయాధికారి పప్పల జగన్నాథం మెడికో లీగల్, పోక్సో, సీసీపీఎన్‌డీటీ చట్టా లను వివరించారు. రిమ్స్ మానసిక వైద్య నిపుణులు రమ, దీపక్ బాధితులకు కౌన్సెలింగ్ చేసి మానసిక సహాయం అం దించాల్సిన ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.మేరీ కేథరిన్, అడిషనల్ డీఎంహెచ్ వో డా.తాడేల శ్రీకాంత్, డీసీవో రామదాసు, సోషల్ వర్కర్ వెంకటస్వామి, ప్రోగ్రాం అధికారులు శివరంజని, రవీంద్ర, సుజాత, ప్రవీణ్, మోహినీరత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాల మెరుగుతోనే విజయాలు సాధ్యం

● జిల్లా ఉపాధి కల్పనాధికారి సుధ



విజేతలకు బహుమతులు అందిస్తున్న అధికారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, సామర్థ్యాలను మెరుగుపరచుకుంటేనే విజయాలు సొంతం చేసుకోవచ్చని జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు క్రీడల ద్వారా ఆరోగ్యం, శారీరక ధారుడ్యం పెంచేందుకు బుధవారం స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ.. జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం ఆనందంగా ఉందని, క్రీడలపై అవగాహన పెంచేందుకు ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.మహేష్ బాబు, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, సెట్‌శ్రీ సీఈవో వీవీ అప్పనాయుడు, డి.శ్రీనివాసరావు, శిక్షకులు మణి, సింహాచలం, హరి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

సోంపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో సముద్రతీర గ్రామాల్లో వేటకు వెళ్లని మత్స్యకారులకు ఉచితంగా బస్తా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని గత నెలలో ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఒక్కో మండలంలో ఒక్కో విధంగా పంపిణీ చేయడంతో మిగిలిన వారు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో గత నెల 9న 'ఆంధ్రజ్యోతి'లో 'ఒక్కో చోట ఒక్కోలా బియ్యం పంపిణీ' శీర్షికతో కథనం వచ్చింది. ఈ విషయాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి వజ్రపుకొత్తూరు మండలంలోని అన్ని రేషన్ డిపోల్లో ఉన్న మత్స్యకారులందరికీ బియ్యం అందేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగం గా బియ్యం, నిత్యావసర సరుకులు డిపోలకు చేరడంతో బుధవారం కొత్తపేట గ్రామంలో సరుకులను ఎమ్మెల్యే శిరీష పంపిణీ చేశారు. కార్డుదారులందరికీ బియ్యం వచ్చేలా చొరవ తీసుకున్నందుకు ఎమ్మెల్యే శిరీషకు మత్స్యకార గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

హిందూ ధర్మాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షుడు నడుకుదిటి తేజా, కార్యదర్శి మేడూరి శేషగిరి రావు అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ నూరేళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 6న ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రీడా మైదానంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తు న్నామని, ముఖ్య అతిథులుగా శ్రీనివాసనంద సరస్వతి, దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ హాజరు కానున్నారన్నారు. ఈ సమ్మేళనానికి అందరూ రావాలని కోరారు.

కార్మిక నేత కొండయ్య మృతి తీరనిలోటు



కొండయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న వామపక్ష నేతలు

ఆమదాలవలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ వ్యవస్థాపక సభ్యుడు, కార్మిక నేత మెట్ట కొండయ్య మృతి ఉద్యమాలకు తీరని లోటని వామపక్ష నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కొండయ్య మృతదేహంపై సంఘం పతాకం పెట్టి ఆయన అంత్యక్రియల్లో పాల్గొని నివాళి అర్పిం చారు. 1970లో ఆమదాలవలస చక్కెర కర్మాగారంలో సీఐటీయూ విభాగాన్ని ఏర్పాటు చేసి కార్మికుల పక్షాన కొండయ్య పోరాటం చేశారన్నారు. అలాగే కార్మికుల ఉద్యమాల్లో ప్రధానభూమిక వహించా రన్నారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కె.శ్రీనివాస్, బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు

సరుబుజ్జిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలికిపెంట గ్రామంలో రామాలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసిందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఆలయ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే రవికుమార్‌ను స్థానికులు కోరారన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే చొరవ తీసుకుని దేవదాయశాఖామంత్రి దృష్టికి తీసుకువెళ్లారన్నారు. ఈ మేరకు నిధులను మంజూరు చేస్తూ దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆలయానికి నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రవికుమార్, సీఎం చంద్ర బాబు నాయుడు, మంత్రి ఆనంరామ నారాయణరెడ్డిలకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు.

ఐఐటీతో ఉజ్వల భవిష్యత్

ఇచ్ఛాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఐఐటీలో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మద్రాస్ ఐఐటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ రాజ్‌కుమార్ బల్ల అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కళాశాల నుంచి ఐఐటీ సీట్లు సాధించిన జ్యోతి, ఈశ్వరి, పూజిత బాధిత్యలను అభినందించారు. భవిష్యత్ లోనూ మరింత మంది ఐఐటీ సీట్లు సాధించాలని ఆకాంక్షించారు. కార్య క్రమంలో ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ దుర్యోధన దొలాయి పాల్గొన్నారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు విద్యార్థులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇంటర్ యూనివర్శిటీ సౌత్‌జోన్ పోటీలకు స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వై.పోలినాయుడు తెలిపారు. వీరు ఈనెలలో జరగనున్న సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్ బి.మోహన్, పలువురు అధ్యాపకులు అభినందించారు.

న్యూస్ బాక్స్

లా స్పాట్ అడ్మిషన్లు వాయిదా

ఎచ్చెర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీలో మూడేళ్ల లా కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 4వ తేదీన జరగాల్సిన స్పాట్ అడ్మిషన్లు వాయిదా వేసినట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ తిరిగి ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని, విద్యార్థులు గమనించాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఆమదాలవలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ మొత్తం చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. దన్నానపేటకి చెందిన దన్నాన రేయమ్మకు రూ.43 వేలు, పొన్నాంపేటకి చెందిన మొరకన దాలిగురువులుకు రూ.1,12,000, సైలాడకి చెందిన జోగి ఉపేంద్రకు రూ24 వేలు, మున్సిపాలిటీకి చెందిన బోయిన సాయిరాజ్‌కు రూ.33 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు చెక్కులను ఎమ్మెల్యే సతీమణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీల అందజేశారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

సోంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీతారాంపేటకు చెందిన సింహాచలం కృష్ణారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన కుటుంబానికి లోక నాథేశ్వర కుట్టుపని సంక్షేమ సంఘం ప్రతినిధులు సాయం అందించారు. ఈ మేరకు బుధవారం బాధిత కుటుం బానికి 25 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు, రూ.5600 నగదు అందజేశారు.

ఘనంగా ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాస్టర్ కుటుంబ సభ్యులు ఆంధ్రాబాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. రాజమండ్రి నుండి వచ్చిన పాస్టర్ సంతోష్ క్రిస్మస్ వర్తమానం అందించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి క్యాండిల్ సర్వీస్‌తో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు అన్వేష్ బాబు, బిషప్, అబ్రహం, జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

సంతకాల పత్రాలు అందించాలి

ఇచ్ఛాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ పత్రాలను వెంటనే అందజేయాలని జడ్పీ చైర్‌పర్సన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయ అన్నారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నిక

కంచిలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కంచిలి ఎంపీపీఎస్ పురుషోత్తపురం పాఠశాలలో ఆవరణలో యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా త్రినాథ్ సాహు, అధ్యక్షుడిగా మురళీనాయక్, ప్రధాన కార్యదర్శిగా పి.లక్ష్మణరావు, కోశాధికారిగా కృష్ణకుమార్, కార్యదర్శులుగా కె.అనూరాధ, ఎ.మోహనరావు, త్రిలోచన ప్రధాన, జకోట్ లిమ్మ, ప్రసన్నకుమార్ ఎన్నికయ్యారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ (సుడా), శ్రీకాకుళం
RFP ప్రకటన
సూపరింటెండెంట్ ఇంజనీర్, సుడా, శ్రీకాకుళం వారిచే RFP సంఖ్య 13/2025-26, తేదీ 02.12.2025 ప్రకారం, "శ్రీకాకుళం ఆఫీసియల్ కాలనీలో ఖాళీ ప్రదేశంలో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ & మెయింటైన్ (DBFOM) విధానంలో రెండు పికిల్‌బాల్ కోర్టులు, బాక్స్ క్రికెట్ అరేనా మరియు క్యాఫెటీరియా అభివృద్ధి" కొరకు అర్హత గల ఏజెన్సీలు/కన్సల్టెంట్లు నుండి EOI https://tender.apeprocurement.gov.in/login.html ద్వారా 04.12.2025 నుండి ఆహ్వానించబడుతున్నాయి. వివరాలు ఏ పని దినమైన కార్యాలయ వేళల్లో పొందవచ్చు.
సం/- సూపరింటెండెంట్ ఇంజనీర్, సుడా, శ్రీకాకుళం





లాభసాటి పంటలపై దృష్టిసారించండి

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



భూసార పరీక్ష ఫలిత పత్రాలను రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో లాభసాటి పంటలపై రైతులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం రామచంద్రపురం (సిమ్మపేట) రైతుసేవా కేంద్రంలో 'రైతన్నా మీకోసం' ముగింపు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధి కోసం లాభసాటి పంటలను ప్రోత్సహించేందుకు పంచసూత్రాల కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. ప్రతీ రైతు ప్రకృతి సేద్యం చేయడం, పంటల మార్పిడి, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, వ్యవసాయ అనుబంధ పంటల సాగు చేపడితే లక్ష్యం నెరవేరుతుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. భూసార పరీక్షా ఫలితాల పత్రాలన రైతులకు అందించారు. సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని అధికారులతో కలిసి తిలకించారు. కార్యక్ర మంలో వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.త్రినాథస్వామి, ఏడీ బగ్గు రజని, ఏవో దుంపల పద్మావతి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



రైతుకు ట్రక్‌షీట్ అందిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

జి.సిగడాం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకొని మద్దతు ధర పొందాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతుల సేవల కోసం 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించి లాభసాటి వ్యవసాయ సాగుపై సూచనలివ్వడం జరుగుతోందన్నారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం పంపిన రైతులకు ట్రక్‌షీట్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు కుమ రాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు బూరాడ వెంకట రమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బెవర జగన్నాథరావు, నాయకుల వజ్జిపర్తి రఘురాం, బాలబొమ్మ వెంకటేశ్వరరావు, భూ పతి అర్జునకుమార్, టంకాల మౌళీశ్వరరావు, తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీవో జి.రామకృష్ణారావు, ఏవో బెండు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం దీర్ఘాశిలో నిర్వహించిన రైతన్నా-మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ధాన్యం దిగుబడిపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ధాన్యం గింజని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తేమ పేరుతో మిల్లర్లు అదనంగా ధాన్యం వసూలు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటానన్నారు. రబీలో ఎరువుల కొరత రానీయకుండా చూడాలని రైతులు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ వెంకటమధుబాబు, ఎంపీడీవో రవికుమార్, సర్పంచ్ మెండ సుమంగళి, నాయకులు రోణంకి కృష్ణంనాయుడు, బి.భాస్కరరావు, ఎంవీ నాయుడు, సూరపు నారాయణదాస్, పల్లి సూరిబాబు పాల్గొన్నారు.

వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకే

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



రబీ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్పు చేసేందుకే ప్రభుత్వం పంచసూత్ర రూపకల్పన చేసిందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. నియోజకవర్గ కేంద్రం పాతపట్నంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన రైతన్నా-మీకోసం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విత్తునాటిన నుంచి పంటను అమ్ముకునే వరకు రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు. ● విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతలతో బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. మన్యం జిల్లా భామిని మండలంలో మంత్రి పర్యటన వివరాలను వివరించారు. హిరమండలం నుంచి కొత్తూరు తదితర ప్రాంతాల్లో ఆహ్వాన విధానాలపై చర్చించారు. ప్రతినేతా విధిగా స్వీయక్రమ శిక్షణతో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

స్వగ్రామానికి చేరుకున్న రాజు మృతదేహం



రాజు మృతదేహం

పలాస రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గతనెల 26న తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన గుంట రాజు(25) మృతదేహం బుధవారం అతడి స్వగ్రామం వీరరామచంద్రపురానికి చేరుకుంది. గొప్పిలి గ్రామ సచివాలయంలో ఇంజనీర్ అసిస్టెంట్‌గా రాజు విధులు నిర్వహిస్తున్నాడు. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చేరుకుని రాజు అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. అయ్యప్ప మాలధారణలో భాగంగా రాజుతోపాటు ఆరుగురు కారులో శబరిమాల వెళ్లి అయ్యప్ప దర్శనం అనంతరం రామేశ్వరం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, రాజు రామేశ్వరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వేర్వేరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు బుధవారం సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి జైలుశిక్ష విధించారు. వివరాలిలా ఉన్నాయి.. ఆమదాలవలస మండలం ఆనందపురం గ్రామానికి చెందిన రేవంత్ మంగళవారం మద్యం తాగి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడగా కేసు నమోదు చేసి న్యాయాధికారి శివరామకృష్ణ ముందు ప్రవేశపెట్టారు. ఈ మేరకు ఆయనకు న్యాయాధికారి ఐదు రోజుల జైలు శిక్ష విధించారు. అలాగే సారవకోట మండలం కుమ్మరిగుంట గ్రామానికి చెందిన నాను శివశంకర్ మద్యంతాగి వాహనం నడిపి నగరంలోని టూటౌన్ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించి కేసు నమోదు చేసి సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి శివరామకృష్ణ ఎదుట హాజరు పరచగా ఐదు రోజుల జైలుశిక్ష విధించినట్టు ట్రాఫిక్ సీఐ రామారావు తెలిపారు.

మతిస్థిమితంలేని వృద్ధుడి మృతి



లక్ష్మీనారాయణ(ఫైల్)

పాతపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీనగర్‌కు చెందిన తడక లక్ష్మీనారాయణ(84) అనే వృద్ధుడు కోదూరు గ్రామ చేరువలో గల పంట పొలాల్లో మృతిచెందిన ఘటన బుధవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక బాలాజీ నగర్‌లో ఉంటున్న తడక లక్ష్మీనారాయణ గత రెండేళ్లుగా మతిస్థిమితం లేక తిరుగుతున్నాడు. ఎనిమిది రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అయితే బుధవారం మండల పరిధి కోదూరు గ్రామ చేరువలో గల పంట పొలాల్లో లక్ష్మీనారాయణ మృతదేహం ఉన్నట్టు అదేవీధికి చెందిన బమ్మిడి వైకుంఠరావు చెప్పగా కుటుంబ సభ్యులు వెళ్లి గుర్తించారు. లక్ష్మీనారాయణ కుమారుడు తడక దాలయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.మధుసూధనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పోలీస్ క్వార్టర్స్ వద్ద పాత జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. సిగ్గీలో పనిచేస్తున్న లావేరు మండలం పెదలింగాలవలసకి చెందిన చందన గణేష్, అంబేడ్కర్ వర్సిటీలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న కొత్తూరు మండలం కడుమ గ్రామానికి పాలిశెట్టి చందు మోటార్ బైక్‌పై ఎచ్చెర్ల నుంచి శ్రీకాకుళం వస్తుండగా ఏఆర్ కార్యాలయం వద్దకు వచ్చే సరికి డివైడర్‌ను బలంగా ఢీకొట్టారు. దీంతో బైక్ టైర్ పేలి రోడ్డుపై పడి గాయాలయ్యాయి. ఈ ఘటనలో వెనుక కూర్చున్న చందు కాలు విరిగిపోగా, బైక్ నడుపుతున్న గణేష్ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే చికిత్స నిమిత్తం ఏపీఎస్పీ బెటాలియన్ వాహనంలో శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లగేజీ ఆటో బోల్తాపడి ఒకరు..

పాతపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధి సోద గ్రామ కూడలి చేరువలో బుధవారం సాయంత్రం ఓ లగేజీ ఆటో బోల్తాపడిన ఘటనలో బేరింగి యశ్వంత్ అనే యువకుడు గాయపడ్డాడు. పోలీసులు వివరాల మేరకు.. ఏఎస్ మణుగు పంచాయతీలోని సంతోషపురం గ్రామానికి చెందిన యశ్వంత్ కొమనాపల్లి కాలనీకు లగేజీ ఆటోలో సామగ్రితో వెళ్లి తిరిగివస్తుండగా సోద గ్రామ చేరువలో కూడలి వద్ద బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న యశ్వంత్ గాయపడడంతో చికిత్స నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకు తరలించారు. యశ్వంత్ పిన్ని బిడ్డికి సుజాత ఇచ్చిన ఫిర్యాదుమేరకు హెచ్‌సీ సీహెచ్ వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా గ్రిగ్స్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నందిగాం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): లఖిదాసుపురం ఉన్నతపాఠశాల మైదానం వేదికగా టెక్కలి నియోజకవర్గ స్థాయి 76వ గ్రిగ్స్ పోటీలు రెండోరోజు బుధవారం ఉత్సాహంగా సాగాయి. బాలికలకు సంబంధించి జూనియర్, సీనియర్ విభాగాలకు సంబంధించి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి హెచ్‌ఎం చిలుకు కృష్ణారావు, మాదిన లోకనాథం తదితరులు బహుమతులు అందజేశారు. వ్యాయామ ఇన్‌చార్జీలు ఎన్.రమేష్, కె.ప్రకాష్, జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడాదిలో రూ.120 కోట్ల అభివృద్ధి పనులు

● ఎమ్మెల్యే గౌతు శిరీష



కొత్తపేట-దేవునల్తాడ రోడ్డును ప్రాంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అబివృద్ధి సాధ్యమని, ఏడాదిలో రూ.120 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్టు ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం కొత్తపేట, సుంకరజగన్నాథపురం, కొమరల్తాడ, దేవునల్తాడ గ్రామాల్లో పూర్తయిన తారురోడ్లను ప్రారంభించారు. అలాగే జల్‌జీవన్ పథకానికి సంబంధించి పనులు ప్రారంభించారు. అనంతరం సుంకజగన్నాథపురంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీల్లో 90 శాతం వరకు పనులు చేశామని, మహిళలకు నెలకు ఇవ్వాల్సిన రూ.1500 పథకం పరిశీలనలో ఉందన్నారు. రైతులు, మత్స్యకారులకు, మహిళలకు రెట్టింపుగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు వివరించారు. గత వైసీపీ అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 20 రోజుల్లోనే రైతులు సాగు నీరందించామని ఇది కూటమి ప్రభుత్వం పనితనానికి నిదర్శమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు, అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, సర్పంచ్‌లు అఖిల్, గోవింద పాపారావు, పీఏసీఎస్ ఛైర్మన్ కర్ని రమణ, నాయకులు కర్ని రమణ, బుల్లోజు శశిభూషన్. సూరాడ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వజ్రపుకొత్తూరులో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతారామయ్య, ఏవో ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందిపెట్టొద్దు: జేసీ ఫర్మాన్



ట్రక్‌షీట్స్ నమోదును పరిశీలిస్తున్న జేసీ అహ్మద్‌ఖాన్

కోటబొమ్మాళి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగొలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం ఆయన చీపుర్లపాడు, జర్జంగి రైతు సేవాకేంద్రాలతో పాటు కోటబొమ్మాళిలో బోయిన ద్వారక రైస్‌మిల్లు, నిమ్మాడలోని వెంకటేశ్వర రైస్‌మిల్లులను టెక్కలి సబ్ కలెక్టర్ కృష్ణమూర్తితో కలిసి పరిశీలించారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, ట్రక్‌షీట్ల నమోదులో ఆలస్యంపై సిబ్బందిని ప్రశ్నించారు. ఎలాంటి అవకతవకలు లేకుండా ధాన్యం కొనుగోలు సజావుగా చేపట్టాలన్నారు. రైతులకు ధాన్యం కొనుగోలు చేసిన నాలుగు గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని ఆయన తెలిపారు. తహసీల్దార్ అప్పలరాజు, ఆర్ఐ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

పాణిగ్రాహి సంస్మరణ సభను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వామపక్ష నాయకులు

పలాసరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న తలపెట్టిన శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట యోధుడు, ప్రజాకళాకారుడు సుబ్బారావు పాణిగ్రాహి సంస్మరణ సభను విజయవంతం చేయాలని వామపక్షాల నాయకులు, ప్రజా కళా మండలి నాయకులు కోరారు. పలాస మండలం బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరం ఆవరణలో సుబ్బారావు పాణిగ్రాహి సంస్మరణ సభ కరపత్రాలను బుధవారం విడుదల చేసి మాట్లాడారు. కరపత్ర ఆవిష్కరణలో వివిధ ప్రజా సంఘాల నాయకులు రాపాక చిరంజీవి, సాలిన కుమార్, బి.శ్రీరాములు, జి.బాలకృష్ణ, రాపాక మాధవరావు, కుసుమ, అరుణ పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

హిరమండలం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నౌతల నుంచి శ్రీముఖలింగం వరకు రహదారి నిర్మాణానికి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అవలంగి గ్రామం వద్ద బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.4.35 కోట్లతో రహదారి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమి వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన అవసరం

హరిపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీలపై ప్రతి ఒక్క మహిళకు అవగాహన అవసరమని ఏపీఎం పి.కూర్మారావు అన్నారు. మందస మండలం మఖరజోల, వీరభద్ర, హరిపురం, ముకుందపురం, బిన్నల, అంబుగాం బొడ్లూరు గ్రామాల్లో బుధవారం డ్వాక్రా మహిలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పొదుపులు, వాడుకున్న అప్పులు, వడ్డీలు, స్త్రీనిధి రుణాల వినియోగం వంటివాటిపై వివరించారు. ఆర్థిక లావాదేవీలపై ప్రతి ఒక్క మహిళతో చర్చించి పలు విషయాలు తెలియజేశారు. కార్యక్రమంలో వీవోఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బుడితి కంచు హస్తకళలకు ప్రపంచస్థాయిలో గుర్తింపునకు కృషి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కంచు వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టర్ పుండ్కర్

సారవకోట (జలుమూరు), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బుడితి కంచు హస్తకళలకు ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుధవారం బుడితి జంక్షన్ వద్ద కంచు కళాకారులకు లేపాక్షి ఆధ్వర్యంలో ఇస్తున్న హస్త కళానైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. బుడితి కంచు హస్తకళాకారులు ఇప్పటికే ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. బుడితిలో తయారయ్యే ఉత్పత్తులకు ప్రపంచస్థాయిలో మార్కెట్ కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కంచు పాత్రలు అలాగే కంచుతో తయారు చేసిన వివిధ కళాకృతులను కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు పరిశీలన



బంకు పనులను పరిశీలిస్తున్న జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

కొత్తూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) గిరిజన ప్రాంత ప్రజల అవసరం కోసం ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. కొత్తూరులో జీసీసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంకు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. బంకు పనుల నిర్మాణంలో నాణ్యత, భద్రతా ప్రమాణాలను పాటించి త్వరగతిగా పనులను పూర్తి చేయించేలా చూడాలని అధికారులను సూచించారు ఛైర్మన్‌తోపాటు జీసీసీ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, మేనేజర్ కృష్ణ, నరసింహులు, పాలకొండ నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ

నరసన్నపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పైడితల్లి జంక్షన్ వద్ద పలు విద్యాసంస్థలకు చెందిన బస్సులను టెక్కలి మెటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు పరిశీలించారు. విద్యార్థులను తరలించే బస్సుల్లో బ్రేక్ సిస్టమ్, ప్రథమ చికిత్సకిట్, అగ్నిమాపక నిరోధాలు, బ్రేడ్ కండిషన్ తదితర వివరాలను పరిశీలించారు. పాఠశాల, కళాశాల బస్సులు ఫిట్‌గా ఉండాలన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

నరసన్నపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారానికి యూటీఎఫ్ కృషి చేస్తుందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నికల నిర్వహించారు. ఈనెల 7న చాపరలో సంఘ జిల్లా కౌన్సిల్ విజయం చేయాలన్నారు. మండల యూటీఎఫ్ అధ్యక్షులుగా నక్క అప్పయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్. జగదీశ్వరరావు తదితరులను ఎన్నుకున్నారు.

జీడివ్యాపారి రూ.3కోట్ల టోకరా

(ఐదో పేజీ తరువాయి)

జీడిపప్పు తీసుకువెళ్లి తిరిగి డబ్బులు చెల్లించకుండా పరారీలు కావడం ఇక్కడ సర్వసాధారణమైపోయింది. గత 20ఏళ్ల నుంచి జరుగుతున్న తంతే ఇది. సాధారణంగా జీడి వ్యాపారులు ఎవరూ నేరుగా ఇతర రాష్ట్రాలకు జీడిపప్పు ఎగుమతి చేసుకొని అమ్ముకునే పరిస్థితి లేదు. దీనికి బ్రోకర్లు వ్యాపారుల మధ్య అనుసంధానకర్తలుగా ఉంటారు. వారి ద్వారానే జీడి మార్కెట్ నిర్వహణ జరుగుతుంది. పెద్ద వ్యాపారులు మొత్తం పదిమంది వరకూ ఉంటారు. వారు మాత్రం నేరుగా లావాదేవీలు చేస్తూ వ్యాపారం సాగిస్తుంటారు. మిగిలిన వ్యాపారులంతా బ్రోకర్లపైనే ఆధారపడడంతో తరచూ మోసాలకు గురవుతున్నారు.

● ఇప్పటివరకూ జరిగిన మోసాలు పరిశీలిస్తే పదుల సంఖ్యలో ఉండడం, రూ.కోట్లలో నష్టపోవడం జరిగింది. దీనిపై రాజకీయ పలుకుబడి వినియోగించి డబ్బులు రప్పించుకున్నవారు కొంతమంది ఉంటే మిగిలినవారు మోసపోతూ ఉన్న వ్యాపారాన్ని విడిచిపెట్టిన సంఘటనలు అనేకంగా ఉన్నాయి. ఏడాది కిందట ఓ వ్యాపారి రూ.5 కోట్ల మేరకు చెల్లించాల్సి ఉండగా ఆయన ఏకంగా ఊరువిడిచి వెళ్లిపోవడంతో ఆ డబ్బులు మొత్తం వ్యాపారులు నష్టపోయారు. రెండేళ్ల కిందట ఓ వ్యాపారి రూ.3 కోట్లతో ఉడాయించాడు. మరో వ్యాపారి.. జీడివ్యాపారుల డబ్బులతో పరారై ఏకంగా స్థలాలు కొనుగోలు చేశాడు. మూడేళ్ల తరువాత వచ్చిన ఆయన స్థలాలు అమ్మి ఆ నగదు వ్యాపారులకు చెల్లించాడు. విశేషం ఏమిటంటే ఆయన కొనుగోలు చేసిన సమయంలో స్థలాల విలువ తక్కువగా ఉండడం, అమ్మకం చేసినప్పుడు పది రెట్లు పెరగడంతో సులభంగా తీసుకున్న అప్పు చెల్లించాడు. అయితే ఆ వ్యాపారికే అధిక లాభం రావడం విశేషం. ఇలాంటి సంఘటనలు ఇక్కడ కోకొల్లలు. బ్రోకర్ల మాయలో పడి రూ.కోట్ల విలువైన జీడిపప్పు నిల్వలు ఇవ్వడం, తీరా వారి నుంచి డబ్బులు పొందడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదృశ్యమైన మహిళ.. శవమై తేలింది

(ఐదో పేజీ తరువాయి)

బావిలో ఆమె మృతదేహం కనిపించింది. ఇది హత్యగా పోలీసులు నిర్ధారించారు. ఆమె చెవి, ముక్కులకు ధరించిన సుమారు 2 తులాల బంగారు ఆభరణాలను దొంగిలించేందుకు ఎవరో దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చని తెలిపారు. పార్వతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని లావేరు ఎస్ఐ అప్పలసూరి తెలిపారు. దీనిపై ఇన్‌చార్జి సీఐ సత్యనారాయణ(ఆమదాలవలస) పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారని వెల్లడించారు. ఇదిలా ఉండగా నిందితుల కోసం లావేరు, రణస్థలం ఎస్ఐలతోపాటు జేఆర్‌పురం సర్కిల్ పరిధిలో పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. హత్య జరిగిన సమీప ప్రాంతంలోని ఓ కొబ్బరితోటలో సోమవారం పేకాట ఆడినవారితోపాటు గంజాయి బ్యాచ్‌ను కూడా పట్టుకుని విచారణ చేస్తున్నారు.

ఆమెను చంపేశారా?

(ఐదో పేజీ తరువాయి)

కూడా స్థలాన్ని పరిశీలించి.. కింతలి మిల్లు జంక్షన్ వరకు వచ్చి ఆగాయి. మృతురాలి మెడపై తాడు బిగించినట్టు ఆనవాళ్లు స్పష్టంగా కన్పిస్తున్నాయి. శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈమెది హత్యగా ప్రాథమికంగా భావిస్తున్నా పోస్టుమార్టం నివేదికలో మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. కాగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

లాభతర వ్యవసాయం కోసమే..

కోటబొమ్మాళి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులకు లాభాలు చేకూర్చే వ్యవసాయం చేసేందుకు అవగాహన కల్పించేందుకే రైతన్నా-మీకోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని టెక్కలి వ్యవసాయశాఖ ఉపసంచాలకులు కె.జగన్మోహన్‌రావు అన్నారు. హరిశ్చంద్రపురంలో ఏవో ఎస్.గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఎన్జీవో కార్యవర్గ ఎన్నిక



ఎన్జీవో నూతన కార్యవర్గ సభ్యులు

నరసన్నపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట తాలుక యూనిట్ పరిధిలో ఎన్జీవో ఉద్యోగుల కార్యవర్గ ఎన్నిక బుధవారం ట్రెజరీ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. సంఘ తాలుకా యూనిట్ అధ్యక్షులుగా ఎస్.రవికుమార్, గౌరవ అధ్యక్షుడిగా ఎల్.మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా టి.గణపతిరావు, కేవీవీ కృష్ణమూర్తి, ఎస్.ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా ఎంఎస్ఎస్ భరద్వాజ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్జీవో కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

కోటబొమ్మాళి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పాత కోటబొమ్మాళి తాలుకా ఎన్జీవో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎస్.రామారావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కరజాన ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వి.శంకరరావు, బి.నరేష్, ఎస్.గోవిందరావు, కార్యదర్శిగా కేవీ రాజేష్‌బాబు, జాయింట్ సెక్రటరీలుగా ఎ.సత్యరాజు, జి.ఈశ్వరరావు, పి.వెంకటేష్, డి.పద్మావతి, ట్రెజరీగా వీఎన్ రెడ్డి ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి కేవీ రాజకుమార్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు, జేఏసీ జిల్లా ఛైర్మన్ హనుమంతు సాయిరాం, సభ్యులు చల్ల శ్రీనివాస్, ఆర్.వేణుగోపాల్, కె.జయరాం, డి.రాజేష్‌కుమార్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సంఘ ఎన్నికలు



టెక్కలి యూనిట్ ఎన్జీవోల సంఘ ప్రతినిధులు

టెక్కలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): టెక్కలి తాలుకా యూనిట్ ఎన్జీవో సంఘ ఎన్నికలు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా డీసీడీవో ఆర్.వేణుగోపాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పూజారి జానకిరామయ్య, ఎన్జీవోల సంఘ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, కార్యదర్శి చల్లా శ్రీనివాస్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా సంపతిరావు మోహనరావు, కార్యదర్శిగా రత్నాకర్, కోశాధికారిగా ఉదయరేఖ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.రమేష్, ఉపాధ్యక్షులుగా సోమేశ్వరరావు, వాసు, తిరుపతిరావు, సహాయ కార్యదర్శులుగా శివకుమార్, వనజాక్షి, సంధ్య, మహిళా అభ్యర్థిగా టి.సంధ్యారాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.